

సిద్దిపేటలోని నాగదేవత ఆలయంలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



జిల్లా వ్యాప్తంగా నాగుల పంచమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పుట్ట వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం పాలు పోసి నైవేద్యం సమర్పించారు. రంగధాంపల్లి స్వయంభు నాగదేవత అమ్మవారి ఆలయం, గాడిచెర్లపల్లిలోని కోటి పడగల సంతాన నాగమ్మ ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, పూజారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశారు.

- సిద్దిపేట కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి)



గజ్వేల్‌రూరల్ : అహ్మదీపూర్ గ్రామంలో మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



గాడిచెర్లపల్లిలోని కోటిపడగల సంతాన నాగదేవత ఆలయంలో భక్తుల రద్దీ



న్యూఢిల్లీ ప్రదర్శనలో బేగంపేట విద్యార్థులు తయారుచేసిన స్మార్ట్ యాక్టింగ్ స్టిక్

జాతీయ స్థాయిలో బేగంపేట

విద్యార్థుల ప్రతిభ

రాయపోల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ఓ ఆవిష్కరణ జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైంది. రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న హర్షవర్ధన్, కార్తీక, చైతన్య, గైడ్ టీచర్ కె.భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో స్మార్ట్ వాకింగ్ స్టిక్‌ను తయారు చేశారు. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2025లో భాగంగా గత డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో లక్షా ఐదువేల వైజ్ఞానిక ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో ప్రదర్శించారు. వాటిలో 27 ఆవిష్కరణలను ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. ఇందులో బేగంపేట పాఠశాల విద్యార్థులు చేసిన ఆవిష్కరణ జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ ఆవిష్కరణలను ఈనెల 28 నుంచి 31 వరకు న్యూఢిల్లీలోని గాల్గోటియాస్ యూనివర్సిటీలో ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, గైడ్ టీచర్ భాస్కర్‌రెడ్డిని అభినందించారు.

స్థానిక పోరులో నువ్వా..నేనా

కొమ్మూరి వర్సెస్ పల్లా

- రహస్య సర్వే చేయించిన ఎమ్మెల్యే
- ప్రతిష్టాత్మకంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ నేత
- సన్నాహక సమావేశాల్లో ఇరుపార్టీలు బిజీబిజీ
- చేర్యాలలో హోరాహోరీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధం
- తెరపైకి పలువురు ఆశావహులు

స్థానిక సంస్థల ఎన్నికలతో చేర్యాల ప్రాంతంలో రాజకీయ సందడి మొదలైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉనికి, పట్టు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాయి. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒకరిపై ఒకరు ఆధిపత్యం చాటుకునేందుకు క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు.

- చేర్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ వ్యూహాలు...


బీఆర్ఎస్ ఇప్పటికే గెలుపు గుర్రాల వేటలో ఉంది. రిజర్వేషన్లు ఎలా ఉన్నా, ఎవరు బరిలో నిలిస్తే గెలుస్తామనే అంశంపై దృష్టి సారించింది. కాలికి గాయమైనా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నారు. గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం క్లస్టర్ల వారీగా ఇన్‌చార్జులను నియమించారు. తమ పార్టీ నేతలు, ఆశావహుల వివరాలు సేకరిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలోని బలమైన వ్యక్తులను కూడా అంచనా వేస్తున్నారు. సర్వేలో సానుకూల ఫలితాలు రావడంతో క్యాడర్‌లో జోష్ నింపే పనిలో ఉన్నారు. నియోజకవర్గంలో పల్లా మద్దతుతో బీఆర్ఎస్ నుండి పోటీ చేసేందుకు ఆశావహులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ సర్వే ఫలితాలు ఆశావహుల్లో టెన్షన్‌ను పెంచాయి. ఎక్కడ చూసినా సర్వే, స్థానిక రాజకీయం గురించే చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్ కసరత్తు.. కొమ్మూరి నజర్

అధికారంలో ఉన్నా, స్థానికంగా ప్రాతినిధ్యం లేకపోవడంతో కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బీఆర్ఎస్‌పై



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పైచేయి సాధించేందుకు సంస్థాగత బలోపేతంపై ఫోకస్ చేశారు. ఇతర పార్టీల నుంచి చేరికలపైనా దృష్టి సారించారు. గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నవారిని, అసమ్మతివాదులను గుర్తిస్తున్నారు. క్యాడర్‌కు మరింత చేరువయ్యే ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పట్టు నిలుపుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆశావహులను గుర్తిస్తున్నారు. అభిప్రాయ సేకరణతో పాటు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుతో క్యాడర్‌లో ఉత్సాహం నెలకొన్నది. ఈ పరిస్థితుల్లో ఎవరికి అదృష్టం దక్కుతుందోనని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

తెరపైకి ఆశావహులు..

రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకపోయినా, కొందరు తాము బరిలో

మిగతా 8వ పేజీలో

గజ్వేల్‌కు

సెకండ్ క్లాస్ కోర్టు

గజ్వేల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌కు స్పెషల్ జ్యూడిషియల్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు మంజూరైందని గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పండరి, సీనియర్ న్యాయవాది గుండు కాశీప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతిని హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం గజ్వేల్‌కు స్పెషల్ జ్యూడిషియల్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టును మంజూరు చేసిందని తెలిపారు. ఈ కోర్టుతో కేసులు మరింత వేగంగా పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వారి వెంట న్యాయవాదులు బాలకృష్ణ, పార్థసారధిరాజు, శ్రీనివాస్, ఏజీపీ కిరణ్ సాగర్ రావు, వనం బాస్కర్ ఉన్నారు.

హుస్నాబాద్‌లో సబ్ కోర్టు

హుస్నాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా న్యాయవాదులు ఎదురు చూస్తున్న హుస్నాబాద్‌లో సబ్ కోర్టు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గత నెల 6న ఇక్కడ సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పక్షాన న్యాయ కార్యదర్శి హైకోర్టుకు లేఖ రాశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో త్వరలో సబ్ కోర్టు మంజూరవుతుందని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హుస్నాబాద్‌లో ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు సివిల్ జడ్జి కోర్టులున్నాయి.

దర్జాగా కబ్జా

- అక్కన్నపేట మండలంలో రెచ్చిపోతున్న కబ్జాదారులు
- సర్వే నంబర్ 387లోని ప్రభుత్వ భూమి 670 ఎకరాల్లో 400 ఎకరాలు స్వాహా

- గతంలో పేదలకు పంచిన భూమినీ వదలని వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు!

అక్కన్నపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జా అవుతున్నాయి. సర్వే నంబర్ 387లో ఉన్న 670 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏకంగా 400 ఎకరాలు కబ్జాకు గురైంది. ఇందులో గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములు కూడా ఉన్నాయి. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అక్కన్నపేటలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములు

భూముల కబ్జా వెనుక కుట్ర

అక్కన్నపేట గ్రామంతో పాటు జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపర్రెకు చెందిన కొందరు ఈ కబ్జాకు పాల్పడుతున్నారు. పలుకుబడిని ఉపయోగించి, గత రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి పట్టాలు కూడా పొందారని సమాచారం. అక్కన్నపేటలోని సర్వే నంబర్ 387లో ఉన్న 670 ఎకరాల ప్రభుత్వ భూమిని 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 1.20 ఎకరాల చొప్పున దళితులు, గిరిజనులు, బీసీలకు పంపిణీ చేశారు. వీరికి 2008 ఆగస్టు 8న పట్టా పాస్ పుస్తకాలు కూడా జారీ చేశారు. అయితే, నీటివసతి లేక పంటలు ఎండిపోవడంతో చాలామంది పేదలు ఆ భూములను సాగు చేయలేకపోయారు. ఆ ప్రాంతంలో ఎకరం రూ.30లక్షల వరకు పలుకుతుండడంతో ఇదే అదనుగా భావించిన కొందరు ఆ భూములపై కన్నేసి, రెవెన్యూ అధికారుల అండదండలతో కబ్జా చేసి పట్టాలు పొందారని తెలుస్తోంది.

రికార్డుల తారుమారు

ప్రభుత్వ భూముల రికార్డులతో పాటు అసైన్డ్ భూముల రికార్డులను కూడా కొందరు కబ్జాదారులు రెవెన్యూ సిబ్బంది సహాయంతో మార్చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాత రికార్డులను తారుమారు చేసి, కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, ఈ ప్రక్రియలో రెవెన్యూ సిబ్బంది, అధికారులకు భారీగా ముట్టాయని పలువురు పేర్కొంటున్నారు.

ఫిర్యాదులు ఉన్నా...చర్యలు సున్నా

సర్వే నంబర్ 387లోని 400 ఎకరాలు కబ్జాకు గురైందని గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు కూడా నిర్వహించారు. కానీ, అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని సహకరిస్తున్నారని

మిగతా 8వ పేజీలో

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్

- అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు
- రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల రేషన్ కార్డులు పంపిణీ : మంత్రి వివేక్ వెంకటస్వామి

సిద్దిపేట/చిన్నకోడూరు/సిద్దిపేటరూరల్ నంగునూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులు నిర్మించి మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు శాడని, దానిపై ఇప్పుడు నేనేమి మాట్లాడనని రాష్ట్ర భూగర్భ, గనులు, ఉపాధి కల్పన శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట, నారాయణరావుపేట, చిన్నకోడూర్, నంగునూర్ మండలాల్లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం అందించేందుకు రూ. 9వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 17 లక్షల ఇళ్లను నిర్మించేలా సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని సోమవారం జరిగిన కేబినేట్ మీటింగ్‌లో సీఎం సూచించినట్లు తెలిపారు. సిద్దిపేట ఎంపీగా ఉన్న తన తండ్రి వెంకటస్వామి కేంద్ర మంత్రిగా 1973లో రేషన్‌కార్డు సిస్టమ్‌ను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆయన వారసుడిగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందించడం ఆనందంగా ఉందన్నారు.



నారాయణరావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

దిమాక్ లేకుండా మాట్లాడుతున్న మంత్రి వివేక్ : హరీశ్‌రావు

సిద్దిపేటకు వచ్చిన మంత్రి వివేక్ మల్లన్న సాగర్ దండిగా కట్టారని దిమాక్ లేకుండా, అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం చిన్నకోడూర్ మండలం మాచాపూర్‌లోని ఆయిల్‌పామ్ గెలల తొలికోత కార్యక్రమానికి అనివార్య కారాణాల వల్ల హజరుకాలేకపోయానని రైతులతో ఆయన ఫోన్‌లో మాట్లాడగా అక్కడున్న వారు మైక్‌లో వినిపించారు. కొన్ని పార్టీల నాయకులు మల్లన్న సాగర్ ఎందుకు కట్టారని ప్రశ్నించడం ఏంటని ప్రశ్నించారు.

మళ్లీ అదే ప్రొటోకాల్ లొల్లి

రేషన్‌కార్డుల పంపిణీలో మళ్లీ ప్రొటోకాల్ లొల్లి వివాదానికి దారితీసింది. మంత్రి వివేక్ కొండా భూదేవి ఫంక్షన్‌హాల్‌కు చేరుకోగానే

మిగతా 8వ పేజీలో

త్రిసభ్య కమిటీ నివేదిక ఏమైంది?



గజ్వేల్‌లోని యూనియన్ బ్యాంక్ నుంచి ఓ మహిళా సంఘం సభ్యులకు వచ్చిన నోటీసు

మెప్మా అవినీతిపై చర్యలు శూన్యం

గజ్వేల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని మెప్మా అవినీతిపై చర్యలు తీసుకోవడం లో జిల్లా యంత్రాంగం ఆలస్యం చేస్తోంది. దీనివల్ల ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి కలెక్టర్ మను చౌదరి మెప్మాలో జరిగిన అవినీతిపై విచారణకు ఒక త్రిసభ్య కమిటీని నియమించారు. అయితే, కొత్త కలెక్టర్ హైమావతి బాధ్యతలు స్వీకరించి 40 రోజులు దాటినా, ఈ కమిటీ ఇంకా నివేదికను సమర్పించలేదు. జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణ నివేదిక 45 రోజులుగా పెండింగ్‌లో ఉంది. ఇక బ్యాంకుల నుంచి ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు నోటీసులు వస్తున్నాయి. గ్రూప్ పేరిట తీసుకున్న రుణాలను తక్షణమే చెల్లించాలని, లేకపోతే ఆస్తులు జప్తు చేస్తామని బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. దీంతో మహిళా సభ్యులు ఆందోళన చెందుతున్నారు. త్రిసభ్య కమిటీ తమ నివేదికను కలెక్టర్‌కు సమర్పించాలని, అక్రమార్కుల నుంచి నిధులు వసూలు చేసి బ్యాంకుల కు చెల్లించాలని బాధితులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?

మీ కుటుంబ సభ్యులలో మీ బంధుమిత్రులలో మీ సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా..? అయితే వారికి, తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి ఆత్మీయ శుభాకాంక్షలు



ఆంధ్రజ్యోతి

అందిస్తోంది సులువైన మార్గం ఉద్యోగవిరమణ ప్రకటనలకు

25% సిటీ /జిల్లా ప్రకటనకు డిస్కౌంట్

15% జోన్ ప్రకటనకు డిస్కౌంట్

ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.

సంగారెడ్డి / పటాన్‌చెరు :99516 09964
నారాయణఖేడ్ / జహీరాబాద్ :97030 18478
మెదక్ /నర్సాపూర్ :97030 18476
సిద్దిపేట /గజ్వేల్ :99485 05054

గుంతల రోడ్లను పట్టించుకోరా?


- గజ్వేల్ - జగదేవ్‌పూర్ రోడ్డుపై గుంతలు
- జగదేవ్‌పూర్ మండలంలో అధ్వానంగా 161వ జాతీయ రహదారి
- మూడు జాతీయ రహదారులను కలిపే లింక్ రోడ్డుకు మరమ్మతులు కరువు

8

ఉద్యమబాట పట్టిన ఉపాధ్యాయులు

6

అత్తను హత్య చేసిన అల్లుడి అరెస్ట్



తపాలా.. నిర్లక్ష్యమేలా..!

- జోగిపేటలో పెచ్చులూడుతున్న భవనం
- 90 ఏళ్ల నాటి భవనంలో కార్యాలయం

జోగిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పోస్టాఫీసులపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ పని చేస్తున్నారు. జోగిపేట పట్టణంలోని పురాతన పోస్టల్ భవనం ప్రమాదం అంచుకు చేరుతోంది. సుమారు 90 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం 2013లో పునరుజ్జీవం పొందినప్పటికీ.. నేడు పెచ్చులూడి ప్రమాదకరంగా మారుతున్నది. సుమారు 80 ఏళ్ల పాటు ఈప్రాంత ప్రజలకు సేవలందించిన ఈభవనం...శిథిలమై, పైకప్పు పెచ్చులూడుతూ.. అటు ఉద్యోగులకు, ఇటు ప్రజలకు నిత్యం భయాందోళనలు కలిగిస్తోంది.

జోగిపేట పట్టణంలో నిజాం కాలంలో సుమారు 90 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాన రహదారి (నేటి జాతీయ రహదారి) ని ఆనుకుని సుమారు 650 పైచిలుకు గజాల విశాల ఆవరణలో పోస్టాఫీసు భవనాన్ని నిర్మించి. పోస్టల్ సేవలు ప్రారంభించారు.. 2010లో ఈ భవనం శిథిలావస్థకు చేరుకున్నది. ఈవిషయాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా జోగినాథ్.. అప్పటి రాజ్యసభ సభ్యుడు దేవేందర్ గౌడ్ ద్వారా అప్పటి కేంద్ర చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కరుణా పిళ్లైపై ఒత్తిడి తెచ్చారు. దరిమిలా.. కేంద్ర ప్రాజెక్ట్ యారో పథకం కింద లుక్ అండ్ ఫీల్ విభాగపు నిధుల నుంచి విడుదల చేసిన రూ.5 లక్షల నిధులతో స్థానిక పోస్టాఫీసు భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు జరపడమేగాకుండా పైకప్పును బాగుచేశారు. భవనంలోని మొత్తం ఫ్లోరింగ్‌ను విన్లైల్ ఫ్లోరింగ్ చేశారు.


జోగిపేటలోని పోస్టాఫీసు భవనం, కుర్చీలపై పడిన పైకప్పు పెచ్చులు, పోస్టాఫీస్ భవనంలో పెచ్చులూడిన పైకప్పు

కార్యాలయంలోని ఉద్యోగుల కోసం నూతన ఫర్నీచర్‌ను, టేబుళ్లను సమారూర్చారు. వినియోగదారుల కోసం కూడా ఫర్నీచర్‌ను టేబుళ్లను అమర్చారు. భవనం మొత్తానికి పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో ప్లాస్టరింగ్ చేసి, తెల్లరంగును వేశారు.

పోస్టాఫీసులో లభించే సేవల వివరాలను భవనం వెలుపల స్టాండీ (బోర్డు)గా ఏర్పాటు చేశారు. కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్ బోర్డును, డిజిటల్ డిస్‌ప్లే సిస్టంను ఏర్పాటు చేశారు. ఇక, సేవల్లో భాగంగా విదేశాలలో నివాసముంటున్న ఈ ప్రాంతంవారు తమ కుటుంబాలకు పంపే విదేశీ డబ్బును ఇక్కడ మన కరెన్సీలోకి మార్చుకునే సదుపాయాన్ని (మనీ ట్రాన్స్‌ఫర్) కూడా ప్రారంభించారు. పోస్టల్ బీమా తదితర సదుపాయాలను కల్పించారు. పెచ్చులూడిన భవనంఇంతవరకూ బాగానే ఉన్నా.. ఈపురాతన భవనం.. పెచ్చులూడుతోంది. పైకప్పు పూర్తిగా ధ్వంసమై పెచ్చులూడుతున్నది. ఇటీవల ఈభవనంలోని పైకప్పు ధ్వంసమై పెచ్చులూడి కిందనున్న కుర్చీలు, టేబుళ్ల పడింది. రాత్రి కావడంతో అక్కడ అటు సిబ్బంది కానీ, ఇటు ప్రజలు కానీ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గోడలు సైతం పగుళ్ళు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరి, పెచ్చులూడుతున్న జోగిపేట పోస్టాఫీసు భవనాన్ని సాధ్యమైనంత తొందరగా పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రజల ఆరోగ్యం బాధ్యత వైద్య సిబ్బందిదే..

కొల్చారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోతంశెట్టిపల్లి సబ్ స్టేషన్‌ను మంగళవారం మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య సిబ్బంది దేనని అన్నారు. పోతంశెట్టిపల్లి సబ్ స్టేషన్ ద్వారా నిరంతరాయ విద్యుత్ అందుతుందని తెలిపారు. ముందుగా కుల్చారం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్, ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ , ల్యాబ్, ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీబీపీ, షుగర్, రక్తపోటు తదితర వ్యాధుల నిర్ధారణ కోసం నగటున ప్రతిరోజు ఎన్ని రక్తపరీకలు జరుపుతున్నారు, వాటి ఫలితాలను ఎలా తెలియజేస్తున్నారని ప్రశ్నించారు. రక్త పరీక్షల నిర్వహణ వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ పోతం శెట్టిపల్లి సబ్ స్టేషన్‌ను పరిశీలించి సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా విధానాన్ని సంబంధిత అధికారుల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరాయ విద్యుత్ అందించడానికి పలు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్



ఉద్యమబాట పట్టిన ఉపాధ్యాయులు

సిద్దిపేట కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు అందరు ఒక్కటయ్యారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందించుకుని నిరసన కార్యక్రమాలకు దిగుతున్నారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా జూలై 23, 24న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్‌ల ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండం సమర్పించారు.

డిమాండ్స్ ఇవే

ప్రభుత్వం ఏర్పడి దాదాపు 2 సంవత్సరాలవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హమీలు అమలు కావటం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి, ఉప విద్యాధికారి పోస్టులు ఖాళీలు ఉన్నాయంటున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని చెబుతున్నారు. పీఆర్సీ నివేదికను వెలువరించి 2023 జూలై నుంచి పీఆర్సీ ప్రకటించలేదంటున్నారు. పెండింగ్ బిల్లులు పెరుకపోయాయని ఆరోపిస్తున్నారు.హెచ్‌ఎం పోస్టులు ప్రకటించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కారించాలి. స్థానిక సంస్థల ఎలక్షన్ల కంటే ముందే సమస్యల సాధనకు ప్రభుత్వం చొరవ చూపాలి. దశలవారీగా ఆందోళన కార్యాక్రమాలు చేపడుతున్నాం. లేదంటే ఉద్యమం మరింత ఉధతం చేస్తాం.

-గాడిపల్లి తిరుపతి రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

అత్తను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

మద్దూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మద్దూరు మండలం ఘర్మాముల గ్రామశివారు బంజరలో అత్తను హత్యచేసిన అల్లుడిని, సహకరించిన అతడి సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేశ్‌కు, అతడి భార్యకి మధ్య వివాదాలు తలెత్తాయి. అందుకు అత్త వజ్రమ్మ కారణమని, తనభార్యతో కాపురం చేయనివ్వడం లేదని, ఆమె చెప్పే మాటలతోనే కాపురానికి రావడం లేదని భావించాడు. జక్కుల హరీశ్, అతడి సోదరుడు ఆమెను చంపాలని నిర్ణయించుకున్నారు. దీంతో కమ్మ కత్తి వెంటబెట్టుకుని బంజరకు వెళ్లి అత్తతో మాట్లాడుతున్నట్లు నమ్మించారు. ఈక్రమంలో జక్కుల మహేశ్ కత్తితో వజ్రమ్మ తల నరకాడు. చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ విచారణ చేపట్టి ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మనోహరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటన సోమవారం మండల పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సింగం నాగరాజు కుటుంబ సభ్యులు ఈ నెల 26న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి కూకట్‌పల్లి వెళ్లారు. దీంతో తాళం వేసిన ఇంటిని ఎవరో దుండగులు పగటగొట్టి ఇంట్లో ఉన్న 30 తులాల వెండి దొంగిలించడం జరిగింది, మంగళవారం ఇతరుల సమాచారం మేరకు వచ్చి చూడగా నిజంగానే దొంగిలించారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విరిగి పడిన భారీ వృక్షం

మెదక్ అర్బన్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మెదక్ రహదారిలోని అక్కన్నపేట వద్ద భారీ చెట్టు విరిగి పడింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో అటుగా వెళ్తున్న ఆటో, బైక్ దాని కింద ఇరుక్కు పోయి ప్రాణ ప్రమాదం తప్పింది. భారీ వృక్షం కావడంతో సుమారు రెండు గంటల పాటు ఇరువైపులా వాహనాలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు జేసీబీ సహాయంతో ఆ చెట్టును రోడ్డు పక్కకు తొలగించారు. ఇరుక్కున్న వాహనాలను బయటకు తీసి, ఆటోలో ఉన్న ఓ డ్రైవర్‌ను, బైక్ పై ఉన్న ఇరువురిని రక్షించారు. ఈ ఉదయం తీవ్రంగా గాలులు వీచటంతో చింత చెట్టు విరిగి పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో గ్రామస్థులు ఎవరూ అటుగా వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది.


వృక్షాన్ని తొలగిస్తున్న జేసీబీ



162 బాటిళ్ల గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి తెలంగాణలోని నల్గొండకు అక్రమంగా తరలిస్తున్న 162 బాటిళ్ల గోవా మద్యాన్ని మంగళవారం చిరాగ్‌పల్లి అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టువద్ద పట్టుకున్నామని ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దఅడిసెపల్లికి చెందిన జయంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి గోవాకు కారులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భాగంగా మంగళవారం గోవానుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా చిరాగ్‌పల్లి అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలు చేసున్నారు. సరైన సమాచారం మేరకు జయంతిరెడ్డి కారును ఆపి తనఖీలు చేపట్టారు. దీంతో కారులో వివిధరకాల 162 బాటిళ్ల గోవామద్యం లభించింది. ఈ మద్యంవిలువ సుమారు రూ.1.50లక్షల వరకు ఉంటుంది. గోవామద్యం, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డీటీఎఫ్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్, చెక్‌పోస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మద్యం పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు.

మిషన్ భగీరథలో సమపాళ్లల్లో ఖనిజ లవణాలు

నిజాంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటిలో ఖనిజ లవణాలు సమపాళ్లల్లో ఉంటాయని, నీటిని తాగడంతో లాభాలు తప్ప నష్టాలు ఉండవని జిల్లా ల్యాబ్ ఇన్‌చార్జి శ్యామయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్(కే) తండాలో మిషన్ భగీరథ నీటిపై మంగళవారం పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోకల్ బోరు నీళ్లల్లో ఖనిజ లవణాలు ఎక్కువ మోతాదులో ఉంటాయని అవి మానవ శరీరానికి మంచిది కాదని, మినరల్స్ సమపాళ్లల్లో ఉండే మిషన్ భగీరథ నీటిని తాగాలని సూచించారు. అదేవిధంగా లోకల్ బోర్ నీళ్ల, ఫిల్టర్ నీటిని పీహెచ్ అలాగే బల్బు టెస్ట్ ద్వారా ఐదు రకాల కెమికల్స్ పారామీటర్స్‌తో నీటిని పరీక్ష చేశారు. అనంతరం మిషన్ భగీరథ నీటిపై ఖనిజ లవణాలపై గ్రామస్థులకు వివరించి ప్రజల ఆరోగ్య దృష్ట్యా అందరూ పరిశుభ్రమైన మిషన్ భగీరథ నీళ్లను తాగాలని, మానవ శరీరానికి కావలసిన అన్ని రకాల లవణాలు తగిన మోతాదులో ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏ ఈ బిక్షపతి, మణికంఠ గౌడ్, కార్యదర్శి ప్రేమలత, గ్రిడ్ సూపర్వైజర్ సుధాకర్ రెడ్డి మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు ఉన్నారు .

నక్షాబాటను విడిపించండి

- వడ్డెనగూడ తండా రైతుల ఆందోళన
- భూమిని కాపాడాలని విజ్ఞప్తి

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని వడ్డెనగూడ తండా పరిధిలో గల సర్వే నంబర్ 312 నుంచి 352 సర్వేనంబర్లలో ప్రభుత్వ నక్షబాట గొలుసు కట్టు వెడల్పు తొవ్వబాట ఉంది. ఇన్ని రోజులు రైతులు నక్షాదారిని పొలాలలకు వెళ్లేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల ఆ నక్షాబాటలోని సర్వేనెంబర్ 342 నుంచి 354 వరకు కబ్జా అయిందని రైతులు ఆరోపించారు. పక్కనే ఉన్న కొందరు భూస్వాములు తమ నక్షాబాటకు పెన్సింగ్ వేసి దారిని మూసేసారని తెలిపారు. మంగళవారం రైతులు ఆ నక్షాబాట వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. తమ పొలాలకు దారి లేకుండా చేసిన కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. ఇదే విషయమై మా గ్రామ రైతులంతా కలిసి రెండు సంవత్సరాలుగా కంది మండల తహసీల్దార్ కార్యాలయంలో, సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు తమ సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. అందుకే తమ గ్రామ రైతులందరం కబ్జాకు గురైన బాట దగ్గర కూర్చొని నిరసన తెలుపుతున్నామన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వడ్డెనగూడా తండాలో కబా అయినటువంటి ప్రభుత్వ నక్షా బాటను సర్వే చేసి రైతులకు దారి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.


నక్షాబాట వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆగుతూ.. సాగుతూ..

● ఏళ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణం
● నిధుల కొరతతో పనుల్లో తీవ్ర జాప్యం
● ఇరుకు గదుల్లో సాగుతున్న కార్యకలాపాలు



బాబుమోహన్‌కాలనీలో నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఎక్సైజ్ కార్యాలయం పనులు

జహీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిధుల కొరత, అధికారుల, నాయకుల పట్టింపులేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. ఆయా కార్యాలయాలు మాత్రం ఇప్పటికీ ఇరుకైన భవనాల్లో కొనసాగుతుండటంతో అధికారులకు, కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో భవనం సుమారు ఎనిమిదేళ్ల కాలంగా నిర్మాణంలో ఉన్నా పనులు పూర్తి కావడం లేదు. జహీరాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న ఎక్సైజ్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం, అటవీశాఖలో ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్ వంటి అనేక భవనాల పరిస్థితి ఇది.

ఎనిమిదేళ్లుగా సాగుతున్న ఎక్సైజ్ కార్యాలయ భవనం పనులు

జహీరాబాద్ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం దశాబ్దాలుగా అద్దె భవనంలో, ఇరుకైన గదుల మధ్య కొనసాగుతోంది. ఈ విషయాన్ని గమనించిన గత పాలకులు, అధికారులు, నాయకుల విన్నపం మేరకు పట్టణంలోని బాబుమోహన్ కాలనీలో 2018లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిదేళ్ల కాలంగా భవన నిర్మాణం పనులు ఆగుతూ సాగుతున్నాయి. ప్రస్తుతం భవనంలో ఫ్లోరింగ్, విద్యుత్, మొదటి అంతస్తు పనులు చేపట్టాల్సి ఉంది. భవన నిర్మాణం పూర్తి కావాలంటే సుమారు మరో రూ.10 లక్షలు అవసరం ఉంది. నిధులు వస్తే పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. అద్దె భవనంలో ఇరుకైన గదుల మధ్య విధుల నిర్వహణ కష్టతరంగా మారిందని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. కార్యాలయ భవనం పనులను త్వరితగతిన పూర్తిచేసి తమకు అప్పగించాలని అధికారులు కోరుతున్నారు.

ఏడీఏ కార్యాలయం మూడేళ్లుగా..

జహీరాబాద్ పట్టణంలో గత మూడేళ్ల క్రితం రూ.40 లక్షల వ్యయంతో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం భవన నిర్మాణం పనులకు అధికారులు, నాయకులు శ్రీకారం చుట్టారు. గత మూడేళ్ల కాలంగా భవన నిర్మాణం పనులు ఆగుతూ సాగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఆ కార్యాలయం ఇరుకైన భవనంలో కొనసాగడం వల్ల అధికారులు, కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రూ.10లక్షలైతే భవనం పనులు పూర్తికానున్నాయని అధికారులు, కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులు గుర్తించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని అధికారులు, రైతులు కోరుతున్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్‌దీ అదే పరిస్థితి..

జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మితమవుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్ పనులు గత మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఆ భవన నిర్మాణానికి ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం రూ.36.48 లక్షలను మంజూరు చేసింది. మూడేళ్లుగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తిచేసి కొలిక్కి తెచ్చాడు. ప్రస్తుతం అందులో శానిటేషన్ పనులను చేయించాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ పరంగా రూ.6లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఒకవైపు బిల్లు చెల్లించడం లేదు. మరోవైపు నిర్మించిన భవనాన్ని అధికారులు హ్యాండోవర్ చేసుకోవడం లేదు. దీంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆయా భవన నిర్మాణం పనులను పూర్తిచేయించాలని అధికారులు, ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా రాచన్నపేటలోని వ్యవసాయశాఖ కార్యాలయం



పనులు పూర్తికాని ఇండస్ట్రియల్ ఏరియాలోని ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్యాలయం



మక్తాఅల్లూరులో పీఎంఏవై రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మక్తా అల్లూరులో కేంద్ర బృందం పర్యటన

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కంది మండలంలోని మక్తా అల్లూరు గ్రామాన్ని మంగళవారం ఎన్ఎల్ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు సాదిక్, బీవీ సునంజనారెడ్డిలు గ్రామస్థులతో, కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ కార్మికులు, పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు, లబ్ధి గురించి తెలుసుకున్నారు. అలాగే, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారు చేపడుతున్న కార్యకలాపాలు, రుణాల వినియోగం తదితర అంశాలపై సమాచారం సేకరించారు. గ్రామంలో నూతనంగా వేసిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన రోడ్డును, నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, రోడ్ ఫార్మేషన్, తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ వనరుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన పలు డాక్యుమెంట్స్ గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్, పీఆర్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి, ఎంపీవో మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలి

● కాశీ పీఠం జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య స్వామిజీ



అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న శివాచార్య స్వామిజీ

పుల్కల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడుచుకొని, కీర్తిని సంపాదించుకోవాలని కాశీ పీఠం జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య స్వామిజీ సూచించారు. పవిత్ర శ్రావణ మాసంలో వీరశైవ మత పరంపర పర్యటనలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన చౌటకూర్ లోని మఠం శంకరయ్య స్వామి ఇంటికి వచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సందేశామిచ్చారు. రోజుకో గ్రామాన్ని పర్యటించి వీరశైవ మత పరంపరను ప్రచారం చేస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. గురువులను భక్తి శ్రద్ధలతో పూజించడం అసలైన భారతీయత అని అన్నారు. లింగధారణ సంస్కారం, మంత్రోపదేశం పొంది ధర్మ మార్గాన్ని అనుసరించాలని స్వామిజీ సూచించారు. ఈ సందర్భంగా జగద్గురువుకు ఘనంగా పాదపూజ నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఓంకార సిద్ధ శివాచార్య స్వామిజీ, గురుసిద్ధ మణికంఠ శివాచార్య స్వామిజీ, చీల మల్లన్న, మఠం మల్లేశం, వీరభద్రస్వామి, మఠం జగదీశ్వర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో పారదర్శకతకే ఆర్టీఐ చట్టం

● రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర కమిషనర్లు, కలెక్టర్

మెదక్ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయనతోపాలు కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, మోసిన్‌పర్వీన్, వైష్ణవీభూపాల్ మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. వీరికి కలెక్టర్ రాహుల్ రాజ్ స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ప్రజావాణి హాల్‌లో ఆర్టీఐ అమలు విధివిధానాలపై అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలోని 29 ప్రభుత్వ శాఖల్లో 15 శాఖల్లో ఏలాంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్ఠంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌లోడ్ ఇప్పించండి

● కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రికి వినతి



ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కార్పొరేటీకరణ తరువాత వర్క్‌లోడ్ లేక ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నామని వారు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు నల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఎంఎస్ నాయకులు, ఉద్యోగులు బాలనర్సయ్య, ఈశ్వరయ్య, ప్రభు, రవి, శివకుమార్, కంది శ్రీనివాస్, ప్రదీప్ కుమార్ ఢిల్లీకి తరలివెళ్లారు. మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్‌ను కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. 500 బీఎంపీ-2 యుద్ధ వాహనాలు, నాగ్-2 వెపన్స్ తయారీ ఆర్డర్లు, వర్క్‌లోడ్ పెంచాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సంజయ్ సేథ్‌ను కోరినట్లు ఉద్యోగులు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఈ విషయాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక అందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పినట్లు వారు తెలిపారు.

ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తికి అరుదైన గౌరవం

● ఐఐఎం అధ్యక్షుడిగా నియామకం



కోల్‌కతాలో ఐఐఎం 79వ వార్షికోత్సవంలో ప్రొఫెసర్లతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తికి అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్‌మెటల్స్ (ఐఐఎం) అధ్యక్షుడిగా ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి నియమితులయ్యారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఐఐఎం 79వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రొఫెసర్ మూర్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుని, నియామక పత్రాన్ని అందజేశారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ అనేది విద్యా, పరిశ్రమ, పరిశోధనలలో మెటలర్జికల్, మెటీరియల్ ఇంజనీరింగ్ నిపుణులకు ప్రాతినిధ్యం వహించే ఒక ప్రముఖ ప్రొఫెషనల్ సంస్థ. ఐఐఎం దశాబ్దాలుగా భారతదేశ మెటలర్జికల్ తయారీ పర్యావరణ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇంత పెద్ద సంస్థకు మూర్తి అధ్యక్షుడిగా నియమితులవ్వడం పట్ల ఐఐటీ అధ్యాపకబృందం సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. 1992లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రొఫెసర్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన బీఎస్ మూర్తి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. ఈ మధ్యనే కేంద్ర విద్యాశాఖ మూర్తిని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా రెండోసారి నియమించి కొనసాగించగా, 2030 వరకు ఆయన ఇక్కడ డైరెక్టర్‌గా తన సేవలను అందించనున్నారు. ఐఐఎం అధ్యక్షుడిగా ఆయనకు ఇవి అదనపు బాధ్యతలు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీలో రసాభాస

● ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే సునీతారెడ్డి అసహనం



రైతు వేదిక బయటే నిలుచున్న ఎమ్మెల్యే సునీతారెడ్డికి నచ్చజెప్పుతున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

చిలప్‌చెడ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల నినాదాలతో రసాభాసగా మారింది. మంగళవారం మండలం పరిధిలోని చిలప్‌చెడ్ రైతు వేదికలో 93 మంది లబ్ధిదారులకు అధికారులు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ముందుగా వెళ్లి మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా, ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి వారితో వాదించారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేసి 'జై కాంగ్రెస్, జై రేవంత్ రెడ్డి' అంటూ నినాదాలు చేయడంతో, బీఆర్ఎస్ నాయకులు వారికి పోటీగా 'జై కేసీఆర్, జై బీఆర్ఎస్' అంటూ నినాదాలు చేయడంతో అంతా రసాభాసగా మారింది. కలెక్టర్ గారు ఇదంతా పట్టించుకోకుండా వేదికలోకి వెళ్లడం సమంజసంగా లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేస్తూ రైతు వేదిక బయటే ఉండిపోయారు. అనంతరం ఆర్డీవో మహిపాల్ రెడ్డి ఆమెకు నచ్చచెప్పి కార్యక్రమానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల పంపిణీ మొక్కుబడి కార్యక్రమమని ఎద్దేవా చేశారు. మండలంలో కేవలం 93 మందికే రావడం ఏంటని ప్రశ్నించారు. ఇది పార్టీ కార్యక్రమం కాదని, ఓర్పు సహనంతో ఉన్నంత మాత్రాన అసమర్థత అనుకోవద్దని హెచ్చరించారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో కలీముల్లా, అధికారులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

శివ్వంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో చేతివాటం ప్రదర్శించినట్లు విచారణలో తేలడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లో నుంచి తొలగించిన ఘటన మంగళవారం గోమారంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని గోమారం గ్రామంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ దొంతి రెడ్డి లక్ష్మణ్‌గౌడ్ ఉపాధి పనులు చేయకుండానే చేసినట్లు రికార్డు చేసి డబ్బులు డ్రా చేయడంతో పాటు, సికింద్లాపూర్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి పనుల్లో కూలీల తప్పుడు పేర్లను బిల్లు చేసినట్లు ప్రజా వేదిక సామాజిక తనిఖీలలో వెలుగు చూసింది. విచారణలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో అతడిని సస్పెన్షన్ చేస్తూ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మి తెలిపారు.


పట్టాలిచ్చినా పాసుబుక్కులు రాలే..

● 555 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదం
● మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య
● అటవీ భూములంటూ కొత్త వివాదానికి తెరలేపిన సంబంధిత శాఖ



సాగులో ఉన్న రైతులు

రామాయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిలా రామాయంపేట మండలం, రాయిలాపూర్ గ్రామంలో ప్రభుత్వ పట్టాలపై కొత్త వివాదం తలెత్తింది. 1995లో 130 మంది లబ్ధిదారులకు 140 ఎకరాల్లో రెవెన్యూ శాఖ పట్టాలు పంపిణీ చేయగా, ప్రస్తుతం ఆ భూములు అటవీ శాఖకు చెందినవని కొత్త వాదన తెరపైకి వచ్చింది. 881 సర్వే నంబర్‌లోని 555.09 ఎకరాల భూమిలో ఈ పట్టాలు ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా రైతులు ఈ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ధరణి పోర్టల్ వచ్చాక ఈ భూములు నమోదు కాకపోవడంతో రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు అర్హత కోల్పోయారు. గత నెలలో జరిగిన భూభారతి కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



భూ భారతిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

30 ఏళ్లుగా సాగులో ఉన్నాం



గత ప్రభుత్వం మాకు భూమి పట్టా ఇచ్చింది. పొదలు తొలగించి వ్యవసాయానికి అనుకూలంగా చేసుకున్నాం. ఒక బోరు కూడా తవ్వి పంటలు పండిస్తున్నాం. కానీ ప్రస్తుతం ఆ పట్టాలు చెల్లవంటూ అధికారులు చేస్తున్న ప్రచారం తగదు. అది అటవీ భూమి అంటూ కొత్త సమస్యను మా నెత్తిన రుద్దడం సరికాదు. ఇదే జరిగితే పోరు బాట తప్పదు.

\- జిన్న రాజయ్య, రైతు

సమస్యకు పరిష్కారం చూపాలి



ఇన్నేళ్లుగా పంటలు పండిస్తూ ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో మా భూములు నమోదు కాలేదు. దీంతో తమ భూములకు రక్షణ లేకుండా పోయింది. పాత పట్టాలు పనికిరావంటూ ప్రచారం చేసి భూములు కాజేయాలని చూస్తుండడం సరికాదు. కాంగ్రెస్ సర్కార్ స్పందించి భూభారతిలోనైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

\-చాకలి బాలమల్లు, రైతు

అటవీ భూములుగా రికార్డులున్నాయి

881 సర్వే నంబర్‌లోని 555.09 ఎకరాల భూములు అటవీ శాఖవిగా రికార్డులు చూపుతున్నాయి. ధరణి పోర్టల్‌లో సదరు భూములు నమోదై ఉన్నాయి. కానీ గతంలో పట్టాదారులకు ఇచ్చిన పేర్లు మాత్రం దీనిలో కనిపించడం లేదు. ఈ సమస్యపై ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా తాము మున్ముందు నిర్ణయం తీసుకుంటాం.

\- తహసీల్దార్ రజినికుమారి

న్యూస్ బాక్స్

నాచగిరి క్షేత్రంలో మిధుశేఖర స్వామి వర్ధంతి

వర్గల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోని శ్రీ శృంగేరి శంకర మఠంలో ఆది శంకరాచార్య ఆలయ ప్రాంగణంలో శ్రీ మిధుశేఖర స్వామి 33వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను హైదరాబాద్ శృంగేరి శంకర మఠం ధర్మాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా శృంగేరి శంకర మఠం ప్రాంగణం భక్తులతో భక్తి పారవశ్యమైంది.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

బెజ్జంకి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని తోటపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను గూర్చి ఆరా తీశారు.

31న గురుకుల పాఠశాలల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల, జూలై 29: ఉమ్మడి మెదక్ జిల్లాలోని సాంఘిక, సంక్షేమ గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లభర్తీకి ఈనెల 31వతేదీన స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు సిద్దిపేట జిల్లా డీసీవో పోలోజు నరసింహాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గాను మిట్టపల్లి, ములుగు, జగదేవ్‌పూర్, సిద్దిపేట రూరల్, తొగుట బాలికల కళాశాల, వర్గల్, కొండపాక, చిన్నకోడూరు, అల్వాల్, కోహెడ బాలుర కళాశాలలో భర్తీ చేయనున్నామని తెలిపారు. అలాగే సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపులకు గాను హుస్నాబాద్-బాలుర, బెజ్జంకి- బాలికల, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల కు చేర్యాల బాలుర, సీఈసీ విభాగంలో రామక్కపేట బాలికల కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 31వతేదీన ఉదయం 9గంటలకు పదవతరగతి ఒరిజినల్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, నాలుగు ఫోటోలతో సంప్రదించాలని కోరారు.

నవోదయ 6వ తరగతిలో ప్రవేశాలకు గడువు పొడగింపు

వర్గల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయం 2026-2027 విద్యా సంవత్సరానికై 6వ తరగతి ప్రవేశం కోసం ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును పొడగించినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఉమ్మడి మెదక్ జిల్లాలోనే చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థుల ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సినారె ప్రస్థానం అందరికీ ఆదర్శం

గజ్వేల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సినారె ప్రస్థానం అందరికి ఆదర్శమని గజ్వేల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినారె ప్రస్థానం అందరికీ ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

ఉద్యోగ నైపుణ్యాలను పెంచుకోవాలి

గజ్వేల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఎస్. గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్‌కేసీ, సిస్కో-మ్యూజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన సాఫ్ట్ స్కిల్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సర్టిఫికేట్ కోర్సు తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ తరగతులు ఈ నెల 29 నుంచి ఆగస్టు 12వరకు కొనసాగుతాయన్నారు.

గుంతల రోడ్లను పట్టించుకోరా?

- గజ్వేల్- జగదేవ్‌పూర్ రోడ్డుపై గుంతలు
- జగదేవ్‌పూర్ మండలంలో అధ్వానంగా 161వ జాతీయ రహదారి
- మూడు జాతీయ రహదారులను కలిపే లింక్ రోడ్డుకు మరమ్మతులు కరువు
- అలిరాజాపేట బ్రిడ్జిపై పెచ్చులూడి తేలిన ఇనుపచువ్వలు
- గొల్లపల్లి చౌరస్తాలో భారీ గుంతలు
- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు


అల్లిరాజపేట బ్రిడ్జి రోడ్డుపై గుంతల్లో తేలిన ఇనుప ఊచలు


గొల్లపల్లి చౌరస్తాలో ప్రధాన రోడ్డులో గుంతలు

జగదేవ్‌పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి వెళ్లే జాతీయ రహదారిపై కల్వర్టు వద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళలో వాహనదారులకు గుంతలు కనిపించక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ఈ రోడ్డు పై ప్రయాణిస్తున్నారు. నిత్యం రహదారి వెంబడి వేలాది సంఖ్యలో వాహనాలు నడుస్తూ ఉంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పెద్దగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూడు జాతీయ రహదారులను కలిపే ఈ లింకు రోడ్డుకు మరమ్మతులు మాత్రం చేయడం లేదు.

కల్వర్టు రోడ్డుపై తేలిన ఊచలు

161వ జాతీయ రహదారిలో జగదేవ్‌పూర్, అల్లిరాజపేట మార్గ మధ్యలో ఓ పెద్ద కల్వర్టును నిర్మించారు. ఈ కల్వర్టు వద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఇనుప ఊచలు ప్రమాదకరంగా బయటకు తేలాయి. జగదేవ్‌పూర్‌లోని గొల్లపల్లి చౌరస్తాలో కూడా రోడ్డంతా గుంతలమయంగా మారిపోయింది. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిండి వాహనదారులకు ఎక్కడ గుంతలున్నాయో తెలియక అదుపు తప్పి గాయాలబారిన పడుతున్నారు. ప్రధాన రహదారి అయినందున నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

మూడు హైవేలకు అనుసంధానంగా..

సంగారెడ్డి, గజ్వేల్, జగదేవ్‌పూర్ మీదుగా విజయవాడకు పెద్ద పెద్ద కంటైనర్, లారీలు నిత్యం పగలు రాత్రి తేడా లేకుండా వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఈ రహదారితో మూడు జాతీయ రహదారులకు లింకు కూడా ఉంది. సంగారెడ్డిలోని బాంబే హైవే, తూప్రాన్‌లోని నాగపూర్ హైవేతో పాటు విజయవాడ హైవేకు లింక్ రోడ్డుగా ఉంది. దీంతో ఈ మార్గంలో వాహనాలు అధికంగా తిరుగుతుంటాయి. అల్లిరాజపేట కల్వర్టు వద్ద ఏర్పడిన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. జగదేవ్‌పూర్ నుంచి భువనగిరి వైపు వెళ్లే వారికి పోలీస్‌స్టేషన్ పక్కన పధాన రహదారిపై పెద్దగుంత ఏర్పడింది. ఈ గుంత మూలమలుపు వద్ద ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు, అదే విధంగా కల్వర్టులు వద్ద గుంతల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సత్వరమే మరమ్మతులు జరిపించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

గుంతలను వెంటనే పూడ్చాలి



గొల్లపల్లి చౌరస్తాలోని ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతల వల్ల నిత్యం పమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా అదుపుతప్పి గాయాలబారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక మరింత ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చివేయాలి.

- బాలాచారి, జగదేవ్‌పూర్

ఉపాధ్యాయులు దేశ భవితకు నిర్మాతలు


కొండపాక: కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు

కొండపాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు దేశ భవితకు నిర్మాతలని రాష్ట్ర పాఠశాలవిద్య పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలోనే ఎక్కువ సమయం ఉంటారని అందుకే ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రంథాలయం పఠనం విద్యార్థులకు అలవడేలా చూడాలన్నారు. పుస్తక పఠనం కోసం ఒక పీరియడ్ కేటాయించాలన్నారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, సెక్టోరియల్ అధికారి రంగనాథ్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ ఉన్నారు. కాగా కొండపాకలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు మంగళవారం సందర్శించారు. పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించి మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం అందించాలని సూచించారు. పాఠశాలలో అమలు చేస్తున్న 'స్టార్ ఆఫ్ ది వీక్', 'లిటిల్ టీచర్', 'పియర్ గ్రూప్ లెర్నింగ్' వంటి వినూత్న కార్యక్రమాల పట్ల అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించారు.

ప్రతీ అంశాన్ని విద్యార్థులకు నేర్పించాలి

దౌల్తాబాద్, జులై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ అంశాన్ని ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నేర్పించాలని ఎంఈవో గజ్జల కనకరాజు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దౌల్తాబాద్ కాంప్లెక్స్ సముదాయంలో పాఠశాలల సముదాయ సమావేశం రెండు రోజుల పాటు నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాల గ్రంథాలయం, పఠన నైపుణ్యాలు నిర్వహణ బోధన నైపుణ్యాలు వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యా బోధన చేపట్టాలని సూచించారు.

ఆహార భద్రత చట్టం అమలుపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ మెంబర్ ఆనంద్

బెజ్జంకి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత చట్టం అమలుపై అధికారులు సమన్వయంతో పని చేసి పక్కాగా పర్యవేక్షణ నిర్వహించాలని ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ సూచించారు. ఆహారభద్రత అమలుపై మంగళవారం బెజ్జంకి రైతు వేదికలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఫుడ్ కమిషన్ మెంబర్ భారతి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతరత్రా విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం అమలు, పోషకాహార పంపిణీ, లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ తదితర అంశాల పై అధికారులతో సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్‌వో తనూజ, డీడబ్ల్యూవో లక్ష్మీకాంత్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆనంద్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం, ఏవో, అంగన్‌వాడీ సూపర్ వైజర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వివేక్ దేనికి ఇన్‌చార్జిగా ఉంటారో తేల్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి ప్రజల సమస్యలు తీరుస్తారా లేక సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల ప్రచారానికి ఇన్‌చార్జిగా ఉంటారో తేల్చుకోవాలని బీఆర్ఎస్ సిద్దిపేట నాయకులు పాల సాయిరాం, ఎల్లారెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, శ్రీహరియాదవ్ మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రేషన్‌కార్డుల విషయంలో మంత్రి వివేక్ మాట్లాడింది పూర్తిగా అవాస్తవమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 6.70 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు వివరించారు. కానీ మంత్రి వివేక్ మాత్రం గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఏమీ ఇవ్వలేదని, తామే రేషన్‌కార్డు సృష్టికర్తలు అన్నట్లుగా మాట్లాడడం సరికాదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ రోజు కూడా రైతులు యూరియా కోసం రోడ్డెక్కిన పరిస్థితి లేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. వెయ్యి పడకల ఆసుపత్రికి ఐదు శాతం నిధులు మంజూరు చేయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగితే, ఇంత చిన్న సిద్దిపేట జిల్లాకు వెయ్యి పడకల ఆసుపత్రి అవసరమా అన్నట్లుగా మాట్లాడినందుకు ప్రజలకు మంత్రి వివేక్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ సుందర్, నాయకులు బాలమల్లు, మోహిజ్, రాములు, ఆంజనేయులు, సాయిప్రేమ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి


చేర్యాలలో ఎల్లమ్మ ఆలయ ఆవరణలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు


హుస్నాబాద్ శివాలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


దుబ్బాకలో పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా నాగులపంచమి పర్వదినాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే తలస్నానాలు చేసి పిల్ల పాపలతో గ్రామసమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి, పసువు కుంకుమలతో పాటు జొన్న పేలాలు సమర్పించుకుని తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని నాగమ్మతల్లిని వేడుకున్నారు. అలాగే అలాగే వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయాల్లో నాగదేవత విగ్రహాలను పాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో మహిళలు దైవదర్శనార్థం బారులు తీరారు.

- న్యూస్‌నెట్‌వర్క్, జూలై 29 (ఆంధ్రజ్యోతి)


కోహెడ: మల్లన్న ఆలయం వద్ద పూజలు


సిద్దిపేట రంగధాంపల్లిలోని నాగదేవత ఆలయంలో భక్తుల సందడి

పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి

రాయపోల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి ఫర్టిలైజర్ షాపుల యజమానులను హెచ్చరించారు. మంగళవారం డీఏవో మండలంలోని రాయపోల్, అంకిరెడ్డిపల్లి, అనాజీపూర్ గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. బిల్లు బుక్, స్టాక్ రిజిస్టర్‌లు, ధరల పట్టికలను పరిశీలించారు.

రైతులకు యూరియా కొరత రానివ్వం

గజ్వేల్: గజ్వేల్‌లో వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్. బాబునాయక్ ఏవో గుండు నాగరాజుతో కలిసి స్థానిక తెలంగాణ ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా బాబునాయక్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా కొరత రానివ్వమని తెలిపారు. ఆగ్రోస్‌లో 20.34 డీసీఎంఎస్‌లో 14.31, జాలిగామలో 13.23, డీసీఎంఎస్ బంగ్లావెంకటాపూర్‌లో 7.56 టన్నుల యూరియాను పంపిణీకి అందుబాటులో ఉంచామని తెలిపారు. హాకా-3లో 25.2 టన్నుల యూరియా బుధవారం పంపిణీకి సిద్ధంగా ఉందని తెలిపారు.

గజ్వేల్‌లో ఎలాంటి కొరత లేదు

గజ్వేల్: గజ్వేల్‌లో యూరియా కొరత లేదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ పరిధిలో యూరియా కొరత ఉందని కొందరు పనిగట్టుకొని చేస్తున్న ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రతిరోజు 50టన్నుల యూరియాను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని డీలర్లు అధికారులకు సహకరించి ఎరువుల పంపిణీకి అడ్డంకులు సృష్టించొద్దని సూచించారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

హుస్నాబాద్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందుల విక్రయంలో ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువ రేటుకు అమ్మితే కఠిన చర్యలు చేపడతామని హుస్నాబాద్ వ్యవసాయ డివిజనల్ ఇన్‌చార్జి అధికారి కె మల్లయ్య హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్‌లోని రైతు వేదికలో హుస్నాబాద్, అక్కన్నపేటకు చెందిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు దుకాణాల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మల్లయ్య మాట్లాడారు. ప్రతి రోజు క్రయ, విక్రయాల సూచిక బోర్డును, ప్రతి రైతుకు విక్రయించే యూరియా, ఎరువుల స్టాక్ రిజిష్టర్ నిర్వహించాలని సూచించారు. యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే క్రిమినల్ కేసునమోదు చేసి, లైసెన్స్ రద్దుచేస్తామని హెచ్చరించారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

వర్గల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా, నానో డీఏపీ వాడటం వలన అధిక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ ఏడీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తునికిఖాల్సా రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాగు కోసం అధికంగా ఎరువులు వాడకం వలన భూసారం దెబ్బతినడంతో పాటు పంటలలో ఉధృతమయ్యే చీడ పీడల వలన దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషశయన, ఏఎంసీ చైర్మన్ విజయ మోహన్, ఏఈవో భారతి, ఎరువుల దుకాణాల డీలర్లు తదితరులు ఉన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

గజ్వేల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం తన్లాడుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ రైతులు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వెంటనే సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు తదితరులున్నారు.

షరతులు లేకుండా యూరియా అందజేయాలి

హుస్నాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీ ఎరువుల కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జి శివరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల సెంటర్‌ను సందర్శించి ఎరువుల నిల్వల వివరాలను తెలుసుకున్నారు. గ్రోమోర్‌లో 300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 20 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం నాయకులు జి రాజు, ప్రవీణ్, లోకేష్ నాయుడు, బిక్షపతి, రవీందర్ తదితరులున్నారు.

రాత్రివేళ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది షాక్


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కుకునూరుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం రాత్రి ఒక్కసారిగా షాకయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఇతర కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ చేస్తూ అధికారులకు షాకిస్తున్న కలెక్టర్ హైమావతి రాత్రి 9 గంటలకు కుకునూరుపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేషెంట్ రిజిస్టర్, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, మరియు ఫార్మసీని పరిశీలించారు. విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్స్‌ను అడిగి ఇతర వివరాలు తెలుసుకున్నారు. 15నిమిషాల పాటు ఆస్పత్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసి నిర్వహణ బాగుందని మెచ్చుకున్నారు. గ్రామస్థుల కోరిక మేరకు అధికారులతో మాట్లాడి త్వరలోనే అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

బెక్కల్‌లో భక్తిశ్రద్ధలతో సీత్లా భవానీ ఉత్సవాలు


సీత్లా భవానీ ఉత్సవాలను జరుపుకుంటున్న బెక్కల్ మహిళలు

మద్దూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామ శివాలితండాలో సీత్లా భవానీ ఉత్సవాలను బంజారాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బంజారాల ఆరాధ్య దైవమైన ఏడుగురు దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మేరామ, త్వాల్జ, సీత్ల, మంత్రల్, హింగ్లాద్వాల్, అంగల్, కంకాలి దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పాడిపంటలు, పశుసంపదతో పాటు పిల్లాపాపలు బాగుండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంతో తండా పెద్ద లకావత్ హరిలాల్ నాయక్, తండా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి

హుస్నాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15లోపు ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేయనట్లయితే సెప్టెంబరు ఒకటవ తేదీన 10 వేల మందితో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రాసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర్ శర్మ, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు కొలుగూరి తిరుపతిరెడ్డి, కార్యదర్శి ప్రతాప్ రాజయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గజ్వేల్/జగదేవ్‌పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో జిల్లాస్థాయిలో ఆగస్టు 1న నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాకు దిగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ బాలికల పాఠశాల, మునిగడప ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

చేర్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెప లాడించాలని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న కాంగ్రెస్‌కు అండగా నిలిచి స్థానికసంస్థల ఎన్నికలలో పట్టంకట్టాలని కోరారు. సమావేశంలో నాయకులు బందిగ రాకేశ్‌కృష్ణన్, భూమని బాలరాజు, కొలుపుల యాదగిరి, నీలం సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరులో నువ్వా..నేనా

(5వ పేజీ తరువాయి..)

ఉంటామని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. చేర్యాల మండలంలో కాంగ్రెస్ నుంచి మాజీ సర్పంచ్ ఆది శ్రీనివాస్, బీజేపీ నుంచి కుర్రారం బాలనర్సయ్య జడ్పీటీసీ బరిలో ఉంటామని ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీ టికెట్ రాకపోతే స్వతంత్రులుగా పోటీ చేస్తామని చెబుతున్నారు. మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, కడవేరుగు మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి, ముస్త్యాల మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, కోతి దాసు, కొమురవెల్లికి సంబంధించి సిలివేరు సిద్దప్ప, మాంకాల సతీష్, బొంగు రాజేందర్‌రెడ్డి, ఏర్పుల మహేష్, సనాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఆశావహుల ఆర్థిక స్థితిగతులు, సామాజిక వర్గ ఓటర్లను పార్టీ అధినేతలు అంచనా వేస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారైన తర్వాతే ఎవరు బరిలో నిలుస్తారనేది స్పష్టమవుతుంది.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్

(5వ పేజీ తరువాయి)


ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన పలు మున్సిపల్ కౌన్సిలర్లు వేదికపైకి చేరుకున్నారు. బీఆర్ఎస్ చెందిన కౌన్సిలర్లు వేదికపైకి వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తామంతా మున్సిపల్ కౌన్సిలర్లు అని ప్రొటోకాల్ అందరికి వర్తిస్తుందని తాము వేదిక పైకి వెళ్లకుంటే, వేదిక పైనున్న వారిని కూడా కిందికి రావాలని పోలీసులకు సూచించడంతో అందరిని కిందికి పంపివేశారు. మంత్రి వివేక్ వేదిక పైకి వెళ్లగా, అధికారులు, కాంగ్రెస్ నాయకులతో పాటు అందరు కౌన్సిలర్లు కూడా వేదిక పైకి వెళ్లారు. సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశంలో మాట్లాడుతున్న తరుణంలో జై బీఆర్ఎస్, జై హరీశ్ అని అనడంతో వేదిక కింద ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జై కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటు నినదించారు.

దర్జాగా కబ్జా..

(5వ పేజీ తరువాయి..)

గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా అక్కన్నపేట మండలంలో భూ కబ్జాలు పెద్ద ఎత్తున జరుగుతున్నా, అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.


ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



అక్కన్నపేటలోని 387 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసి పట్టాలు పొందారు. భూమిలేని నిరుపేదలకు ఇచ్చిన భూమిని కూడా కబ్జా చేశారు. నిరుపేదలకు భూమిని ఇప్పించి, ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తులతో పాటు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

-రామంచ మహేందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, అక్కన్నపేట

కబ్జా చేసిన వారిపై చర్యలు



అక్కన్నపేట శివారులో ఉన్న జనగామ-సిద్దిపేట జిల్లాల సరిహద్దులను జిల్లాల సర్వేయర్లతో గుర్తించి హద్దులు నిర్ణయిస్తాం. సర్వే నంబర్ 387లో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఉట్కూరి అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట